అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డికి డాక్టరేట్



ఘట్‌కేసర్: మేడ్చల్ జిల్లా ఉప్పల్ అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్(ఎఫ్ఆర్ఓ) శ్రీనివాస్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. 2015 నుంచి తెలంగాణలో హరితహారంపై శ్రీనివాస్‌రెడ్డి పరిశోధన చేసినందుకు తెలంగాణలో మొదటిసారి ఆయనకు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీలో 83వ కాన్వొకేషన్ ప్రోగ్రామ్‌లో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్, చైర్ అండ్ సీఈఓ అడోబ్ ఇంక్ యూఎస్ఏ శాంతను నారాయేన్ చేతులమీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. డాక్టరేట్ గ్రహీత శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి సారి తెలంగాణ హరితహారంపై డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మండలంలోని ఎల్లంపేట్ 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎల్లంపేట్ గ్రామం, ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నామినేషన్ టైమ్.. గెట్‌రెడీ..

- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ షురూ..
- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరణ
- జనరల్ రూ.10 వేలు.. ఎస్సీ, ఎస్టీలకు రూ.5 వేల డిపాజిట్
- ఆర్ఓ ఆఫీసులోకి అభ్యర్థితో పాటు నలుగురి మాత్రమే అవకాశం
- ఆన్‌లైన్ ఇబ్బందులు ఉంటే.. రిటర్నింగ్ అధికారి నుంచి పొందవచ్చు



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ హైదరాబాద్‌తో సహా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభం కానుండటంతో.. ఎన్నికల అధికార యంత్రాంగం అంతా సిద్ధం చేసింది. నామినేషన్ల దాఖలు ప్రక్రియలో రాజకీయ పార్టీలతో సహా అభ్యర్థులు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తన, నియమావళిని కూడా వెల్లడించారు. 3వ తేదీ నుంచి 10 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను శాసనసభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లేందుకు అనుమతి ఇస్తారు. వాహనాలను ఆర్ఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఉంచాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ యాప్ ద్వారా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఆన్‌లైన్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే నేరుగా సంబంధిత రిటర్నింగ్ అధికారి ద్వారా అనుమతి పొందాల్సి ఉంటుందని ఎన్నికల అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

నామినేషన్ పత్రాలు దాఖలు చేసే కేంద్రాలివే..

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ పత్రాలను కీసర ఆర్డీఓ కార్యాలయంలో సంబంధిత రిటర్నింగ్ అధికారి స్వీకరిస్తారు. మిగతా 4 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన అభ్యర్థుల నామినేషన్ పత్రాలను జీహెచ్ఎంసీ పరిధిలోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయాల్లో ఎన్నికల అధికారులు స్వీకరిస్తారు.

దరావతు(డిపాజిట్) చెల్లింపు

- అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానంలో పోటీచేసే అభ్యర్థి రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్(దరావతు) చెల్లించాలి. ఈ డిపాజిట్ సొమ్మును బ్యాంకు చలనా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్ పత్రంతో జత చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాలి. ఈ బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాలి. బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రంలో తప్పని సరిగా పేర్కొనాలి. అభ్యర్థి 10 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నామినేషన్ పత్రంతో జతపరచాలి. నామినేషన్ పత్రాలు దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రంతో పాటు పార్టీ జారీ చేసిన ఏ–ఫాం, బీ–ఫాం పత్రాలను సమర్పించాలి.

నేరచరిత్ర.. ఆస్తుల వివరాలు

- అభ్యర్థులు తన నేర చరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులు, ఇతరత్రా కోర్టులో విచారణలో ఉన్న కేసుల వివరాలతో సహా తనతోపాటు, భార్య, పిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు, బ్యాంకులో డిపాజిట్లు, నగదు నిల్వ వివరాలు వెల్లడిస్తూ.. అఫిడవిట్ (ప్రమాణ పత్రం) సమర్పించాలని ఎన్నికల అధికార యంత్రాంగం పేర్కొంటోంది.

అభ్యర్థిత్వంపై ప్రతిపాదనలిలా..

- అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థిని పోటీ చేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఒక ఓటరు ప్రతిపాదించాలి. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాలి. ప్రతిపాదించే వారు తన ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాలి. అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు అవకాశముంటోంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థానంలో నామినేషన్ పత్రం దాఖలుకు అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. తెలంగాణ రాష్ట్రం పరిధిలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థికి ఖచ్చితంగా ఓటు హక్కును కలిగి ఉండాలి.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్ఎస్‌తోనే యువతకు భవిత

మంత్రి మల్లారెడ్డి



యువతను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: యువతకు ఉన్నతమైన భవితను కల్పించడంలో బీఆర్ఎస్‌కు ఏ ఇతర పార్టీ సాటిరాదని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. అన్నోజిగూడలో బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ బుధవారం నిర్వహించారు. అనంతరం శివాస్ ఫంక్షన్ హాల్‌లో నాయకులు రాజా నాయక్, విక్రమ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో 500 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులైన యువకులు బీఆర్ఎస్‌లో చేరడం అభినందనీయమన్నారు. యువకుల చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయ ఢంకా మోగించాలన్నారు. కార్యక్రమంలో సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి, చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొంగ్ల బాలేష్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, మెట్టు బాల్ రెడ్డి, బాలగోని వెంకటేశ్ గౌడ్, బి.హరిప్రసాదరావు, సుర్వి రవీందర్, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరు

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్



దమ్మాయిగూడలో నిర్వహించిన సమావేశంలో వజ్రేష్‌యాదవ్

కీసర: రాష్ట్రంలో పేదలకు ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే ప్రజలంతా ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ఆర్‌జీకే కాలనీలో మంగళవారం రాత్రి నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన కాంగ్రెస్ నేత నక్కా ప్రభాకర్‌గౌడ్, బీ బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసారి కాంగ్రెస్‌ను ఎవరూ ఆపలేరని, బీఆర్ఎస్ పాలనతో ప్రజలంతా ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రజలను పట్టించుకోలేని మంత్రి మల్లారెడ్డిని ఓడించాలని నక్కా ప్రభాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. వివిధ పార్టీలకు చెందిన కొంత మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, ముప్ప రామారావు, కౌన్సిలర్లు గోగుల సరితావెంకటేష్, ముప్ప శ్రీలత, వెంకటేష్, నేతలు సామల శ్రీనివాస్ రెడ్డి, సోమేష్, ఈగ శ్వేత, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించండి

జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్



సాక్షి, మేడ్చల్‌జిల్లా: శాసనసభ ఎన్నికలను సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల అధికారులకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి పి.గౌతమ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. రాజకీయ పార్టీలకు సకాలంలో ఓటర్ల జాబితాను అందిస్తామని పేర్కొన్నారు. నామినేషన్లకు సంబంధించి పార్టీలు సువిధ యాప్ ద్వారా 48 గంటల ముందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు మౌలిక వసతులు, అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐదు నియోజకవర్గాల్లో ఎన్నికల కేంద్రాలను మార్చిన చోట్ల అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని, ఇంకా ఏమైనా అవసరాలు ఉంటే తెలపాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల ఖర్చుల లెక్కలు తప్పనిసరిగా చెప్పాలని సూచించారు. సమావేశంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఐదు నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. నామినేషన్లకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల నామినేషన్ మొదలుకొని ఓటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై నిషేదం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ప్రభావం ఎన్నికలపై పడే అవకాశమున్నందున ప్రజా ప్రాతినిధ్యం చట్టం –1951లోని సెక్షన్ 126ఏ ప్రకారం ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ నిర్వహించరాదని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచురణలు, ప్రసారాలు చేయరాదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 7 ఉదయం 7 గంటల నుంచి 30 సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ ప్రసారాలు, ప్రచురణలపై నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా లేదా రెండు ఉంటాయని ఎన్నికల సంఘం పేర్కొందని ఆయన తెలిపారు.

జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల తనిఖీలు నిర్వహించగా, ఇప్పటి వరకు రూ.17,64,10,901 నగదు, రూ.24,66,92,170 విలువ చేసే ఆభరణాలు, 84,445 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి పి.గౌతమ్ తెలిపారు. ఎక్సైజ్ శాఖకు సంబంధించి 508 కేసులు నమోదు కాగా, 262 మందిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న రూ.4,20,90,417 నగదు తిరిగి అప్పగించినట్లు ఆయన తెలిపారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీకి 185 కేసులు రాగా, 141 డిస్పోజ్ చేసినట్లు తెలిపారు. అలాగే ఆరు కేసులకు ఎఫ్ఐఆర్ నమోదు కాగా, ఇందులో ఒకటి ఐటీ శాఖకు సంబంధించిందని, రెండు కమర్షియల్ ట్యాక్స్‌కు చెందినవని పేర్కొన్నారు.

స్కేటింగ్ ఎంపికలు

ఘట్‌కేసర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లా స్కేటింగ్ అండర్–11, అండర్–14 బాలురు, అండర్–17 బాలబాలికల ఎంపిక బౌరంపేట్‌లో ఈనెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల నిర్వాహణ కార్యదర్శి వినోద్‌కుమార్ తెలిపారు. పోటీలో పాల్గొనే అండర్ బాలబాలకలు ఈ నెల 4న రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఎస్‌కే8 స్కూల్ అకాడమీ, డిల్లీ పబ్లిక్ స్కూల్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ దగ్గర ఎస్ఆర్‌కే గ్రీన్ విల్లాస్ వద్ద ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. క్రీడాకారులు అర్హత ఫామ్‌లో ఫొటోతో పాటు బోనాఫైడ్, ఆధార్ కార్డు, గతేడాది ప్రోగ్రెస్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, సర్టిఫికేట్లపై హెచ్ఎం సంతకం, స్టాంప్ తప్పనిసరి ఉండాలని సూచించారు. ఫోన్: 83744 61481, 98486 29132.

నేటినుంచి బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవాలు

కీసర: నేటి నుంచి 5వ తేదీ వరకు కీసరలో బొడ్రాయి పున:ప్రతిష్ఠ మహోత్సవ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు గ్రామ పురోహితుల ఆధ్వర్యంలో పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొదటి రోజు గ్రామంలో పుణ్యాహవచనం, గోపూజ, యాగశాలప్రవేశం, బొడ్రాయి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం పోతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్‌తో పాటు పెద్దఎత్తున అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అల్వాల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీలో మర్రి రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా అరుంధతి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది హాజరై వివిధ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కో–ఆప్షన్ సభ్యులు జ్యోతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, డోలి రమేష్, రమణారెడ్డి, గోపికృష్ణ, డిల్లీ పరమేష్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయక దేవాలయ వార్షికోత్సవం

మౌలాలి: మౌలాలి డివిజన్ ఈస్ట్ సుధానగర్‌లోని వినాయక దేవాలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మౌలాలి కార్పొరేటర్ దంపతులు గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఆరా



మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని బుధవారం రాచకొండ అడిషనల్ సీపీ తరుణ్‌జోషి, డీసీసీ ధరావత్ జానకి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ఓ రవికిరణ్, ఈఆర్ఓ రాజును అడిగి ఏర్పాట్ల గురించి వివరాలు సేకరించారు. ఆర్ఓ కార్యాలయం సమీపంలో తీసుకోవాల్సిన భద్రతాచర్యలు, బందోబస్తు గురించి ఏసీపీ రవీందర్, సీఐ ప్రవీణ్‌కుమార్‌కు సూచనలు చేశారు.

బీఆర్ఎస్‌కు నేతల ప్రచారం



నాగారంలో ఎన్నికల ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో మంత్రి మల్లారెడ్డి గెలుపుకోసం ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, నాయకులు ఇంటింటి ప్రచారం జోరుగా చేపడుతున్నారు. నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్, కీసరలో సర్పంచ్ మాధురి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పోగుల నర్సింహారెడ్డి



ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని బోడుప్పల్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి అన్నారు. చెంగిచర్ల 2వ డివిజన్ పరిధిలో బృందావన్ కాలనీ, గణేష్‌నగర్, సాయినగర్, మాతా అరవింద కాలనీ, వీఎస్ఎస్‌డీ కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో బుధవారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, నేతలు తూర్పాటి యాదయ్య, హరినాథ్‌రెడ్డి, మేకల యాదగిరి, గణేష్‌నాయక్, ఉమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, రాజు, సంపత్, సోమేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

మౌలాలి: మౌలాలి డివిజన్ హనుమాననగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి బుధవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల తర్వాత ఆర్య వైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకటేశ్వర్లు, గణేష్, పోచయ్య, గణేష్, రవికుమార్‌గుప్తా, వాసుదేవగుప్తా, గణేష్‌గుప్తా, కాంగ్రెస్ నాయకులు వినోద్‌యాదవ్, ఉమామహేశ్వరి, ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, దశరథ్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, భాస్కర్, జాన్‌బీ, ఖాసీంబి, సునందరావు, సంతోష్ రాందాస్, సందీప్‌గౌడ్, రఘుయాదవ్, ఆగమయ్య, మదర్ పాల్గొన్నారు.

వర్గీకరణకు అనుకూలం అంటూనే అన్యాయం

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలం అంటూనే.. మాదిగలను ఆయా రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచా నెహ్రూనగర్‌లో విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో అధికార, ప్రతిపక్షాలు కాలయాపన చేస్తూ.. మాదిగల జీవితాలతో ఆడుకుంటున్నాయని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ తమ నిజాయితీ..చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. ఈ నెల 11న నిర్వహించే విశ్వరూప మహాసభకు పెద్దఎత్తున కదిలి రావాలని మంద కృష్ణ మాదిగ కోరారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

జవహర్‌నగర్: వాహనాల తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అక్రమంగా గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ వికలాంగుల కాలనీలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బాలాజీనగర్‌కు చెందిన చిట్టిబాబు(32), అర్జున్(35) అక్రమంగా గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. గంజాయి విక్రేతలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐలు లక్ష్మణ్, అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఇన్‌స్పెక్టర్ సీతారాం అభినందించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఉప్పల్: ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఉప్పల్ పోలీసులు దాడి చేసిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఉప్పల్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ పారిశ్రామికవాడ, లక్ష్మీనారాయణ కాలనీలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.40,800 నగదు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పోలింగ్ బూత్‌లను సందర్శించిన ఆర్వో

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్‌లను ఉప్పల్ ఆర్వో అభిషేక్ అగస్త్య(ఐఏఎస్) సందర్శించారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని పోలింగ్ బూత్, కేంద్రాల్లోని సౌకర్యాలు, ఓటర్ల జాబితా, ఓటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజుగౌడ్, సూపర్‌వైజర్ ఎం.ముఖేష్, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.



చదువుతో పాటు క్రీడలకు సముచిత స్థానం

సీఆర్‌పీఎఫ్ ప్రిన్సిపల్ అపర్ణ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అపర్ణ, ఉపాధ్యాయులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనందున బుధవారం పాఠశాలలో వారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మిల్లన్ దత్త, ఆదిత్య, అభిరాం, ఐనాకుమారి, రిషిక్‌లను స్కూల్ ప్రిన్సిపల్ డి.అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్ సత్కరించారు. అనంతరం ప్రిన్సిపల్ అపర్ణ మాట్లాడుతూ.. సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు ఎంపికవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీకాంత్‌గౌడ్, హెచ్ఎం.ఆశాజీకుమారి, ఉపాధ్యాయులు రమణమూర్తి, గోపాలకృష్ణ, వెంకటరాజు, కిషోర్, ఈశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్కాజిగిరికి మంత్రి హరీశ్‌రావు



గౌతంనగర్: మంత్రి హరీశ్‌రావు గురువారం మల్కాగిరిలో జరిగే బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజరుకానున్నట్లు మల్కాజిగిరి నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి శంభీపూర్ రాజు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, మల్కాజిగిరి సర్కిల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్.జితేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు మల్కాజిగిరిలోని షికారి మల్లయ్య గ్రౌండ్‌లో జరిగే సభ స్థలాన్ని పరిశీలించారు. సుమారు 10 వేల మందితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరుగుతుందని తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ ఎదుట బీఆర్‌టీయూ నాయకుల నిరసన



కంపెనీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌టీయూ నాయకులు

మేడ్చల్‌రూరల్: కార్మికులు బీఆర్‌టీయూ సంఘంలో చేరారని యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందంటూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మయోర కంపెనీ ఎదుట బుధవారం బీఆర్‌టీయూ నాయకులు ఆందోళన నిర్వహించారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ నాలుగు నెలల క్రితం కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు బీఆర్‌టీయూ సంఘంలో చేరారని తెలిపారు. కార్మికులు యూనియన్‌లో చేరడంతో కంపెనీ మేనేజర్, హెచ్ఆర్‌లు సంఘంలో చేరిన సభ్యులను విధుల పరంగా ఇబ్బందులకు గురిచేయడంతో పాటు అక్రమంగా భౌతిక దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. ఇబ్బందులకు గురిచేస్తున్న మేనేజర్, హెచ్ఆర్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల పక్షాల తమ సంఘం నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు మల్లేష్, నర్సింహ, సభ్యులు మధుసూదన్, శ్రీను, ప్రసాద్ రావు కార్మికులు పాల్గొన్నారు.